## క్లుప్తంగా

### సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



**వరికుంటపాడు:** సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ అబ్దుల్‌హమీద్ అన్నారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, విరువూరు సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

### దుప్పట్ల పంపిణీ



**జలదంకి:** స్థానిక దొరువుకట్ట గిరిజనులకు నేహా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామాల రాజేష్‌రెడ్డి గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. తన కుమారుడు జ్ఞానరుషిక్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 30 కుటుంబాల పేదలకు దుప్పట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. రామాల రమేష్‌రెడ్డి, కూరపాటి బ్రహ్మారెడ్డి, వేలమూరి కిరణ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఈక్రాప్ నమోదు వేగవంతం



**అల్లూరు:** మండలంలో ఈక్రాప్ నమోదును వేగవంతం చేయాలని ఏడీఏ కన్నయ్య వీఏఏలను ఆదేశించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. జిల్లాలోనే అల్లూరు మండలం ఈక్రాప్ నమోదులో చివరి స్థానంలో ఉందన్నారు. వీఏఏలు రైతులకు అవగాహన కల్పించి ఈక్రాప్ నమోదును వేగవంతం చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఓ వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు..

### గడియారాల అందజేత



**ఉదయగిరి:** గండిపాళేనికి చెందిన పేర్నంపాటి రమేష్, కుంభగిరి గోపాల్ సంయుక్తంగా ఉదయగిరి ఆర్టీసీ డిపోకు 17 గోడ గడియారాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రమేష్ తన తల్లి పేర్నంపాటి గోవిందమ్మ జ్ఞాపకార్థంగా బస్సుల్లో అమర్చేందుకు గడియారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఏడీసీ సలాం, రమేష్ మిత్రబృందం బీ వెంగళరావు, పీ వెంకటేష్, సీహెచ్ శశికిరణ్, పీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


### ఎరుకులరెడ్డిపాళెంలో ఇరువర్గాల ఘర్షణ

**కలిగిరి:** ఎరుకులరెడ్డిపాళెంలో భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాల వారు గురువారం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఓ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, మరో వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి కావలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఉత్కంఠభరితంగా క్వార్టర్స్ పోటీలు

**కావలి రూరల్ :** పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ క్వార్టర్స్ స్థాయికి చేరుకుంది. గురువారం జరిగిన తొలిమ్యాచ్‌లో ధమాకా లెవన్స్‌పై ఎస్వీ లెవెన్స్ జట్టు విజయం సాధించింది. 39 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన హరి మనోహర్‌కు మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రెండో మ్యాచ్‌లో అల్లూరు లెవెన్స్‌పై లెవెన్‌బుల్స్ జట్టు విజయం సాధించింది. ఉత్తమ ప్రదర్శన చేసిన కిషోర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

### దేశంలో కుంటుపడిన అభివృద్ధి



**కావలి :** బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పేదలు అప్పుల్లో ఉండడంతో గత ప్రభుత్వాలే ఎంతో మేలు అనే చర్చలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం విదేశాల నుంచి అప్పుగా తెచ్చిన కోట్లాది రూపాయల ను ఏ అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబునాయుడు తన పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని, మళ్లీ తన కుమారుడ్ని సీఎం చేయాలని పాదయాత్రలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు.

# ప్రజాకవి యోగి వేమన

**ఉదయగిరి:** ప్రజాకవి యోగి వేమన అని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి ఎంపీడీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన గొప్పకవి, సంఘసంస్కర్త అని కొనియాడారు. సమాజంలో వేమన నీతి శతకాలు తెలియని వారుండరన్నారు. ఎన్నో అర్థవంతమైన శతకాలను రచించిన వేమనను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఏఓ రేణుక, ఈఓపీఆర్డీ మల్లికార్జున, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

• వెంగళరావునగర్ ప్రాథమిక పాఠశాలలో వేమన చిత్రపటానికి హెచ్ఎం షబ్బీర్, అంగన్‌వాడీ కార్యకర్త మమత పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జలదంకి:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రజాకవిగా, సంఘ సంస్కర్తగా, తాత్వికవేత్తగా వేమన ఎంతో మంచిపేరు తెచ్చుకున్నాడని కొనియాడారు. ఏఓ జీ భవాని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థులకు వేమన పద్య పోటీలు**

**కొండాపురం:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేమన పద్య పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగంలో గెలుపొందిన వారికి వేమన సాహిత్య పుస్తకాలు, బహుమతులు అందజేశారు. హెచ్ఎం అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్, శ్రీలలిత పాల్గొన్నారు.

**ఆత్మకూరురూరల్:** ఎంపీడీఓ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి ఎండీపీఓ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ ఉషారాణి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: ఎంపీడీఓ కార్యాలయంలో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

**యోగి వేమనకు నివాళి**

**చేజర్ల:** మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాకవి, సంఘసంస్కర్త యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి ఎంపీడీఓ విజయలలిత పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ శ్రీదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన రచించిన నీతి శతకాలను గుర్తు చేసుకున్నారు. ఈఓపీఆర్డీ వీరేంద్ర, ఏఓ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం పుల్లయ్య తెలుగుపండితుడు ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వ్యాసరచన, వక్తృత్వ పోటీలు**

**అనుమసముద్రంపేట:** స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ప్రిన్సిపల్ బీ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.



కొండాపురంలో..



ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో..



చేజర్లలో..



అల్లూరులో..



జలదంకిలో..



ఆత్మకూరు: విజేతలకు బహుమతుల ప్రదానం



ఏఎస్‌పేట: కేజీబీవీ విద్యాలయంలో..

# నవరత్నాలతో రాష్ట్రం అభివృద్ధి



రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

**అనుమసముద్రంపేట:** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రంగన్నపాడు, అబ్బాసాహెబ్‌పేట, కొత్తపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా రంగన్నపాడులో వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోందని, కల్వర్టులు నిర్మించాలని కొందరు మహిళలు ఎమ్మెల్యేను కోరగా ఆయన స్పందించారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను గడప గడపకు చేరవేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు పింఛన్లు మంజూరు చేసేవారని గుర్తుచేశారు. అర్హులైన పింఛన్లు అందక ఎంతో మంది ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి పింఛన్లు అందజేస్తోందని తెలిపారు. అబ్బాసాహెబ్‌పేట, కొత్తపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ నారసింహారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పులిమి వెంకట రమేష్‌రెడ్డి, షబ్బీర్, అంబటి కోటిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 28న మండల సర్వసభ్య సమావేశం

**సోమశిల:** అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ గురువారం తెలిపారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

### ఇంటర్నెట్ సేవలకు అంతరాయం

**వరికుంటపాడు:** పెద్దిరెడ్డిపల్లిలోని యూనియన్ బ్యాంకులో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడడంతో గత మూడ్రోజులుగా లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై బ్యాంకు అధికారులను సంప్రదించగా ఇంటర్నెట్ సేవల్లో సాంకేతిక లోపం తలెత్తిందని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. ఖాతాదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

### ప్రభుత్వ వైద్యుడికి అభినందన

**వింజమూరు:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేస్తున్న గున్నం మధుమోహన్‌ను రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ప్రత్యేకంగా అభినందిస్తూ లేఖ పంపారు. వింజమూరు సీహెచ్‌సీలో డాక్టర్ మధుమోహన్‌రెడ్డి తన సతీమణి సుజాతను ఈ నెల 11న కాన్పు కోసం చేర్పించారు. ప్రభుత్వ మత్తువైద్యుడు, గైనకాలజిస్ట్ ద్వారా సిజేరియన్ కాన్పును విజయవంతంగా చేయించి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబసంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు డాక్టర్ మధుమోహన్‌ను అభినందిస్తూ స్వయంగా లేఖ రాశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సదుపాయాలు ఉన్నాయని సామాన్య ప్రజల్లో విశ్వాసాన్ని నింపేలా కాన్పు చేయించారని కొనియాడారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ చక్రధర్ బాబు సైతం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వింజమూరులోని జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి సిమెంట్ రోడ్డుకు రూ.50లక్షలు విడుదల చేయించారు.

### దాతకు కృతజ్ఞతలు



**ఆత్మకూరు:** పట్టణంలోని జీఆర్‌పేటలో నిర్మిస్తున్న వినాయక ట్రస్ట్ కమ్యూనిటీ హాల్‌కు ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి రూ.2,25,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరులో మెట్టుకూరును ట్రస్ట్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కేతా మస్తాన్‌రెడ్డి, ఏ మహేష్ డీ మధుసూదన్, శ్రీరాములు, శేఖర్, హేమంత్, తదితరులు ఉన్నారు.

## మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు అధికం



కావలి: డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటరమణ



ఆత్మకూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కావలి రూరల్:** మానవ తప్పిదాల కారణంగానే 80శాతానికిపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కావలి డీఎస్పీ వెంకటరమణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీ ఆవరణంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. డ్రైవింగ్ సమయంలో వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. అతివేగంగా, మద్యం తాగి వాహనాలను నడుపరాదని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, ఒకటో పట్టణ, కావలి రూరల్, కలిగిరి సీఐలు శ్రీనివాసరావు, రాజేష్, సాంబశివరావు, డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు, బస్సు, ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** స్కూల్ బస్సులను నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎంవీఐ ఎం రాములు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీనివాస పాఠశాలలో స్కూల్ బస్సుల డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రయాణ సమయంలో సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులను ఘనంగా సన్మానించారు. ఎస్సై రాజేష్, ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది, పాఠశాల నిర్వాహకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, డీ వెంకటసుబ్బయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## గృహ లబ్ధిదారులను ఆన్‌లైన్లో నమోదు చేయాలి

**సీతారామపురం:** మండలంలోని 14 పంచాయతీల్లోని గృహ లబ్ధిదారుల వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమీక్షించారు. మండలంలో 630 మంది గృహ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఏఈ శ్రీనివాసరాజు, వర్క్ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**బిట్రగుంట :** రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీలోని కోళ్లదిన్నెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన నవరత్నాల హామీల్లో భాగంగా ఏడాది కాలంలోనే అన్నీ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టోలో ప్రకటించని మరెన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిపోయారన్నారు. పేదలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఇంట్లో ఒక విద్యా దీపం వెలగాలనే ఆలోచనతో విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. పేదలకు అందని ద్రాక్షగా ఉన్న ఇంగ్లిష్ చదువును వారి ముంగిట నిలిపి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే అవ్వాతాతలు ఎదురు చూపులు చూస్తుండేవారన్నారు. ప్రస్తుతం వలంటీర్లు ఒకటో తేదీ తెల్లవారక ముందే ఇంటి తలుపుతట్టి పింఛన్ అందించి వారి ముఖంలో చిరునవ్వులు చూస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి ఒక్క జగనన్నకే సాధ్యమని తెలిపారు.వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**కావలి :** ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైద్యసిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. వసతులను పరిశీలించి వైద్యసేవలపై రోగులను ఆరాతీశారు. ప్రభుత్వం నాడు–నేడు కింద ఆస్పత్రులను అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయిలో ఎటువంటి ఖర్చు లేకుండా వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతులకు ఉపయోగపడేలా ఎఫ్‌డీఆర్ పనులు

**సోమశిల:** అన్నదాతలకు ఉపయోగపడేలా ఎఫ్‌డీఆర్ పనులు చేపట్టినట్లు ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమోహన్ తెలిపారు. అనంతసాగరం మండలంలో ఎఫ్‌డీఆర్ నిధులతో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. వరికుంటపాడులో నల్లవాగుపై నిర్మించిన కల్వర్టు, అనంతసాగరం చెరువు ఆయకట్టు పొలాల్లోకి నిర్మించిన రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

**ఆత్మకూరు రూరల్:** అప్పారావుపాళెంలో ఎఫ్‌డీఆర్ నిధులతో చేపట్టిన పనులను నీటిపారుదల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ గురువారం పరిశీలించారు. ఆత్మకూరు ఈఈ రాపూరు వెంకటేశ్వర్లుతో కలిసి పనుల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం నీటి పారుదల శాఖ కార్యాలయంలో క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. డీఈ లీలాకుమారి, ఏఈలు యాసిన్,ఖాదర్‌బాషా, పుల్లయ్య, పెంచలరావు, సతీష్చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణమోహన్

## పెట్రోల్ బంకు నిర్మాణ పనుల పరిశీలన

**సీతారామపురం:** మారంరెడ్డిపల్లి సహకార సంఘ కార్యాలయం వద్ద జరుగుతున్న పెట్రోల్ బంకు నిర్మాణ పనులను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ చల్లా శంకరబాబు గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట పీడీసీ సెల్ అధికారులు ప్రదీప్, భగవాన్, సహకార బ్యాంకు ఏజీఎం శ్రీనివాసులురెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



# క్రీడలతో మానసికోల్లాసం



సోమశిల: విజేతలకు బహుమతుల ప్రదానం

**సోమశిల:** క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అనంతసాగరంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ముజ్జు లెవన్స్‌కు రూ.10,116, రన్నర్‌గా నిలిచిన జాలీ బాయ్స్ జట్టుకు రూ.5,116 నగదు అందజేశారు. డీటీ ప్రదీప్, సర్పంచ్ బొర్రా శోభ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ కరిమొహిద్దీన్, వడ్లపల్లి శ్రీనివాసులు, బొర్రా బాబు, తదితరులు పాల్గొన్నారు.

**క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం**

**ఉదయగిరి:** వెంగళరావునగర్‌లో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు సురేష్ గురువారం బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొనగా, విజేతగా నిలిచిన ఉదయగిరి డేంజరస్ బాయ్స్‌కు రూ.20,116, రన్నర్‌గా నిలిచిన వెంగళరావునగర్ యూత్ జట్టుకు రూ.10,116 నగదును అందజేశారు. వెంగళరావునగర్ ఎంపీటీసీ గుంటుపల్లి మాలకొండయ్య, వెంగాప్రసాద్, బొడ్డు వంశీ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: విజేతలకు బహుమతుల ప్రదానం

# వైఎస్సార్‌సీపీ శ్రేణుల శ్రేయస్సే లక్ష్యం



కలిగిరి: మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి



వింజమూరు: మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

**వింజమూరు:** వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల శ్రేయస్సే లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లాల కొండారెడ్డి, వనిపెంట వెంకటసుబ్బారెడ్డి అనుచరులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణం, ఆత్మకూరు–వింజమూరు రోడ్డు దుస్థితిని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళతామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ప్రభుత్వ పరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే అధికారుల ద్వారా పరిష్కరిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**రాష్ట్రాభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం**

**కలిగిరి:** రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయరెడ్డి అన్నారు. అనంతపురంలోని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి నివాసంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్థాయి నాయకులను చిరంజీవిరెడ్డి పేరుపేరున పరిచయం చేశారు. ఈ సందర్భంగా పరిశీలకుడు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల నియామకం ద్వారా గ్రామస్థాయిలో పార్టీ పటిష్టత చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీటీసీ ఎంపీపీ మెట్టుకూరు శిరీష పాల్గొన్నారు.